క్లుప్తంగా

బంగారు మంగళసూత్రం బహూకరణ



ఐనంపూడి(పామర్రు): ఐనంపూడి గ్రామంలో నూతన వధూవరులకు గ్రామ సర్పంచ్ దంపతులు బంగారు మంగళసూత్రాన్ని బహుమతిగా ఇవ్వడం అభినందనీయమని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఐనంపూడి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన నంమాల ఏసు వెంకటేశ్వరమ్మ దంపతుల కుమారుడు నందమాల బాబు వివాహం సందర్భంగా సర్పంచ్ భట్లు పరంజ్యోతి రాఘవలు బంగారు మంగళసూత్రం బహూకరించారు. అనంతరం అనిల్‌కుమార్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు బీవీ రాఘవులు పాల్గొన్నారు.

మొవ్వ ఏఎంసీ చైర్మన్‌గా దోనేపూడి

కూచిపూడి(మొవ్వ): మొవ్వ ఏఎంసీ చైర్మన్‌గా బీజేపీ నాయకుడు దోనేపూడి శివరామయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనచేత మొవ్వ ఏఎంసీ గౌరవాధ్యక్షుడిగా ఉన్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సమక్షంలో ఏఎంసీ కార్యదర్శి అక్బర్‌బాషా ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ చైర్మన్‌గా ఎస్ కిరణ్, సభ్యులుగా ఆలూరి రుక్మిణమ్మ, బొమ్మారెడ్డి సంధ్యారాణి, గంజాల దుర్గమ్మ, గరికే మంగమ్మ, గొంతుపులి సుజాత, మట్ట మోహన్, మీర్జా సర్వర్ అబ్బాస్, పాముల ప్రకాష్ రావు, పోలన అశోక్ కుమార్, చలసాని శ్రీదివ్య, వీరంకి రాజ్యలక్ష్మి, పిచ్చిఈశ్వరరావు, శివరామకృష్ణ బాధ్యతలు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడ్లవల్లేరు: చంద్రాల, గుడ్లవల్లేరులో విద్యుత్ లైన్లను కమ్మేసిన చెట్లను కొట్టే దృష్ట్యా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని గుడివాడ ట్రాన్స్‌కో ఈఈ జి.బి.శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ముదినేపల్లి ఫీడర్ పరిధిలోని ముదినేపల్లి, పెయ్యేరు గ్రామాల్లో విద్యుత్ లైన్లకు దగ్గరలో ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ.శ్రీనివాసరావు తెలిపారు. వరహాపట్నం సబ్‌స్టేషన్‌లో పరిధిలోని వరహాపట్నం, వదర్లపాడు గ్రామాలు, అదేవిధంగా కైకలూరులో బృందావనం కాలనీ సమీప ప్రాంతాలకు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

గుడ్లవల్లేరు: భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలను శుక్రవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు తెలిపారు. తొలుత స్వామివార్లకు నూతన వస్త్రాలంకరణ, విశేష నైవేద్యం, అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం వార్షికోత్సవాల అంకురార్పణ చేస్తారు. 108 నదుల నుంచి తెచ్చిన జలాలతో స్వామికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు కృష్ణారెడ్డి, సుధారెడ్డి తెలిపారు. వసంతోత్సవాల నడుమ బంగారు ఉత్సవం చేపట్టనున్నట్లు తెలిపారు. వేడుకలను డోకిపర్రు మాజీ సర్పంచ్ వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

నేడు వికసిత కృషి సంకల్ప అభియాన్

పామర్రు: పామర్రు మండలం జుఝవరం లోని సచివాలయం వద శుక్రవారం ఉదయం 9 గంటలకు నుంచి వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఘంటసాల కేవీకే సమన్వయకర్త, శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా జూన్ 12 వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో కృషి విజ్ఞాక కేంద్రం వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. 30 మంది విద్యార్థులకు కంప్యూటర్ విభాగంలో శిక్షణ ఇచ్చినట్లు క్లబ్ అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. రాజేంద్ర నగర్‌లోని జి.వి.పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్లో సర్టిఫికెట్లు పంపిణీ చేశామని తెలిపారు. సెలవుల్లో సమయాన్ని వేసవిలో వృథా చేయకుండా కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంపొందించేందుకు ఈ శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు.

మేట వేసిన గుర్రపు డెక్క.. నీరు సాగేదెలా?

- అన్నదాతల ఆందోళన
- బిల్లులు చేసుకునేందుకు అక్రమాలకు తెరలేపుతున్న కాంట్రాక్టర్లు



నందివాడ మండలం తమిరిశ వద్ద చంద్రయ్య డ్రైయిన్‌లో మేట వేసిన గుర్రపుడెక్క



ఎల్ఎన్‌పురం వద్ద బుడమేరులో దట్టంగా పేరుకుపోయిన గుర్రపుడెక్క

గుడివాడరూరల్: గుడివాడ, నందివాడ మండలాల్లో డ్రెయిన్లలో పూడికతీయకపోవడంతో అధ్వాన్నంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్రెయిన్ల పరిస్థితి మరింతగా దిగజారింది. డ్రెయిన్లు, కాల్వల మెయింటినెన్స్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు సంబంధించిన నిధులకు టెండర్లు సగానికి సగం కోతతో దాఖలు చేసిన కాంట్రాక్టర్లు పనులు దక్కించుకుని ఏడాది గడిచిపోయింది. పనులు చేయకుండానే బిల్లులు చేజిక్కించుకునేందుకు అధికారులతో కలిసి అక్రమాలకు తెరలేపారు. మేజర్ అయిన చంద్రయ్య డ్రెయిన్ ద్వారా నందివాడ, మండవల్లి, గుడివాడరూరల్ మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగు నీరు అందించడంతో పాటు మురుగునీరు బయటకు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది.

గుర్రపుడెక్క మేటతో ప్రవాహానికి అవరోధం

ప్రతి ఏడాది చంద్రయ్య డ్రెయిన్‌లో గుర్రపుడెక్క మేట వేసి నీటి ప్రవాహానికి అవరోధంగా మారుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెయింటినెన్స్ నిధుల పేరిట 2024 జూన్ 1 నుంచి 2025 మే 31 వరకు ఏడాదికి గాను రూ.20,17,200లు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియలో భాగంగా పెడన ప్రాంతానికి చెందిన వ్యక్తి పనులు చేయడానికి 23 శాతం మైనస్‌తో పనులు చేయడానికి టెండర్ దక్కించుకున్నారు. అది జరిగి ఏడాది గడిచినా ఇప్పటి వరకు కాంట్రాక్టర్ పనులు చేసిన దాఖలాలు లేవు. డ్రెయిన్‌కు నీరు వచ్చిన సమయంలో గుర్రపుడెక్క నీటి ప్రవాహానికి పోలుకొండ రెగ్యులేటర్ వద్ద షట్టర్లు మూసివేయడంతో భారీ స్థాయిలో డెక్క నిల్వ ఉండిపోతుంది. లస్కర్లతో కుమ్మక్కైన కాంట్రాక్టర్లు రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా షట్టర్లను లేపి గుర్రపుడెక్కను కొల్లేరులోకి వదిలేస్తున్నారు. అది కాస్త కొల్లేరు ప్రాంతంలో చంద్రయ్య, బుడమేరు కలిసే చోట దట్టంగా పేరుకుపోయి నీరు దిగువకు ప్రవహించడం లేదు. ఫలితంగా రైతన్నలకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది. అధికారులు కాంట్రాక్టర్ ప్రలోభాలకు లొంగి పనులు చేసినా చేయకపోయినా బిల్లులు ఇచ్చేస్తుండటంతో పనులు సక్రమంగా సాగడం లేదు.

బుడమేరుదీ ఇదే పరిస్థితి

రాష్ట్రంలోనే మేజర్ డ్రెయిన్‌గా పేరుగాంచిన బుడమేరుదీ ఇదే పరిస్థితి. నందివాడ మండలంలోని పుట్టగుంట వంతెన నుంచి కొల్లేరులోకి డ్రెయిన్ కలిసే ప్రాంతం వరకు గుర్రపుడెక్క తొలగింపుకు గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది మే నెల వరకు రూ.31.98 లక్షల మేర మెయింటినెన్స్ నిధులు మంజూరు చేశారు. గుడివాడ ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ 48 శాతం తక్కువతో పనులు చేయడానికి కాంట్రాక్ట్ చేజిక్కించుకున్నారు. గుడివాడ ప్రాంతంలో పనులు దక్కించుకోవడంలో ఆరితేరిన వ్యక్తిగా గుర్తింపు పొందిన సదరు కాంట్రాక్టర్ ఒక్క పని చేయకుండానే బిల్లులు అధికారుల అండదండలతో చేజిక్కించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గత ఏడాదిలో చేయని పనులకు బిల్లులు నిలుపుదల చేసి, వచ్చే ఏడాది కాలంలో మంజూరు చేసిన నిధులను సక్రమంగా వినియోగించి తమకు మేలు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

డ్రెయిన్లలో పూడిక తీయాలి



మేజర్ డ్రెయిన్లు అయిన చంద్రయ్య, బుడమేరులో గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోవడంతో నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. మురుగు నీరు సక్రమంగా ప్రవహించకపోవడం తో డ్రెయిన్లు ఎగదన్ని చిన్నపాటి వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. డ్రెయిన్లలో పూడిక పనులు వెంటనే చేపట్టాలి.

– సత్యనారాయణ, రైతు, ఎల్ఎన్‌పురం

జేబులు నింపుకుంటున్న కాంట్రాక్టర్లు



డ్రెయిన్ల మెయింటినెన్స్‌కు నిధులు మంజూరు చేస్తున్నా కాంట్రాక్టర్ల స్వార్థం, అధికారుల అవినీతి వలన రైతులకు మేలు జరగడం లేదు. సగానికి సగం కోతలతో కాంట్రాక్ట్ దక్కించుకుని పని చేయకుండా కాంట్రాక్టర్లు జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వం పర్యవేక్షణ శూన్యం కావడమే ముంపునకు ప్రధాన కారణం. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి నిధులు దుర్వినియోగం కాకుండా పనులు జరిగేలా చూసి, రైతులకు మేలు చేయాలి.

– చింతాడ నాగూర్, ఎల్ఎన్‌పురం, నందివాడ మండలం

చెరువు తవ్వకం నిలిపివేత

ముదినేపల్లి రూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా చేపట్టిన చెరువు తవ్వకాలను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. గురజలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ అనుమతులు లేకుండా పంట పొలాలను చెరువుగా తవ్వుతున్నారు. దీంతో పంటలు నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని సరిహద్దు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్వో కె.కిషోర్ చెరువు తవ్వకం పనులను పరిశీలించి, అడ్డుకున్నారు.

గణితంపై ఆసక్తి పెంచుకోవాలి

ముదినేపల్లి రూరల్: ప్రాథమిక విద్యార్థులు గణితంపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవచ్చని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి ఎం.శ్రీదేవి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు గురువారం గణితంపై అవగాహన కల్పించారు. అనంతరం పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు.

పెదపూడి జిమ్ ప్రాంగణం పరిశీలన

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడి జిమ్ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం నిర్వహించే యోగాంధ్ర-25ను విజయవంతం చేయాలని ఉయ్యూరు ఆర్డీఓ బీఎస్ హెలా షారోన్ పిలుపునిచ్చారు. ఆమె గురువారం సాయంత్రం పెదపూడిలో జిల్లాస్థాయిలో నిర్వహించే యోగాంధ్ర-25 కోసం తీర్చి దిద్దుతున్న జిమ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్ని జీవులకు మొక్కలే జీవనాధారం



గుడివాడ పాత కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం



గుడివాడ ఆర్డీఓ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం



కైకలూరు కోర్టులో మొక్క నాటుతున్న జూనియర్ సివిల్ జడ్జి శివకిరణ్

11వ అదనపు జిల్లా జడ్జి సుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్: ప్రపంచంలో ఉన్న అన్ని జీవులకు మొక్కలే జీవనాధారం అని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురువారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక పాత కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కొంతకాలంగా చెట్లు గొడ్డలివేటుకు, రంపపు కోతలకు బలవుతున్నాయన్నారు. అడవులు ఇప్పుడు కనుమరుగయ్యాయన్నారు. ఈ కారణంగా వాతావరణంలో పెను మార్పులు సంభవించి మనిషి జీవితమే ఇబ్బందికర పరిస్థితులకు నెట్టబడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడంతో పాటు అది పెరిగి పెద్దదయ్యే వరకు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి. గాయత్రి, న్యాయవాదులు పాల్గొన్నారు.

– ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డీటీ బాలాజీ, ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మొక్కలు నాటారు. అల్లూరులో జరిగిన కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుడు శీలం రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. వడాలి, ముదినేపల్లి, చిన్నకామనపూడి గ్రామాల్లో సర్పంచ్‌లు మరీదు దుర్గశ్రీ, నిమ్మగడ్డ కైకమ్మ, చిట్టూరి నాంచారయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

మండవల్లిలో..

మండవల్లి: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సజావుగా సాగుతుందని సుధామ ఫౌండేషన్ మండవల్లి వ్యవస్థాపకుడు సూదాబత్తుల విజయ్‌కుమార్, ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి అప్పారావు, రిటైర్డ్ హెచ్ఎం కె సూర్యారావు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని వారి గృహాల్లో పలుచోట్ల మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సర్పంచ్ మెండా ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ గురువారం మొక్కలు నాటారు. స్థానిక సంపద తయారీ కేంద్రం, ఆ ప్రదేశంలోని సీసీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్డీ, పీఆర్ ఏఈ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



చోరగుడిలో పర్యావరణంపై అవగాహన ర్యాలీ

అవగాహన ర్యాలీ

పమిడిముక్కల: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మండంలోని చోరగుడి గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో కార్యదర్శి రమణ మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామస్తులు కందిమళ్ల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు నాటుదాం

తోట్లవల్లూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని గురివిందపల్లి సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని గురివిందపల్లిలో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం జరిగింది. పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ పాల్గొన్నారు.



కూచిపూడిలో మొక్క నాటుతున్న ఆర్డీఓ బీఎస్ హెలా షారోన్

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఉయ్యూరు ఆర్డీఓ బీఎస్ హెలా షారోన్ పేర్కొన్నారు. కూచిపూడిలోని సచివాలయ ప్రాంగణంలో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, ఆర్ఐ విజయదుర్గ, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ కిరణ్, పంచాయతీ కార్యదర్శి కె పుష్పనాథం తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గురువారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం, ఎంపీడీఓ.ఫణీంద్ర, సీడీపీఓ దీప్తి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆటపాక నివాసం వద్ద మొక్కలు నాటారు.

కోర్టు ఆవరణలో..

కైకలూరు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

భూసారాన్ని కాపాడుకోవాలి

కేవీకే సమన్వయకర్త సుధారాణి



కపిలేశ్వరపురం సదస్సులో మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త సుధారాణి

పమిడిముక్కల: అధిక మోతాదులో రసాయనిక మందుల వినియోగం ద్వారా నేల కలుషితం అవుతుందని, అందువల్ల భూసారాన్ని కాపాడుకోవాలని జిల్లా నోడల్ అధికారి, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త సుధారాణి తెలిపారు. కపిలేశ్వరపురం రైతు సేవా కేంద్రం ప్రాంగణంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సుధారాణి మాట్లాడుతూ అవశేష రహిత పంట ఉత్పత్తులను పొందాలని చెప్పారు. వరిలో ప్రధానంగా ఆశించే కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు, పొడ తెగులు యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను ఏఓ గణేష్‌రెడ్డి తెలియజేశారు. ఖరీఫ్ సాగులో ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై నూతన వంగడాలు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై రైతులతో చర్చించారు. యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రైతు సేవా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గూడూరు శివరామకృష్ణప్రసాద్, శాస్త్రవేత్తలు రేవతి, పద్మావతి, అనిత పాల్గొన్నారు.

‘కోమటి’కి మాజీ మంత్రి పేర్ని పరామర్శ



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న పేర్ని నాని

ముదినేపల్లి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్‌ను మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య(నాని) గురువారం పరామర్శించారు. విష్ణువర్ధన్ తండ్రి రామకోటయ్య ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. విష్ణువర్ధన్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పేర్ని నాని పరామర్శించి తమ సానుభూతి తెలియజేశారు. అనంతరం నియోజకవర్గంలోని నాయకులతో కలిసి మాట్లాడారు. నాయకులు దూలం వినయ్‌కుమార్, ముదినేపల్లి, మండవల్లి ఎంపీపీలు రామిశెట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, నాయకులు రామిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగింపును అడ్డుకుంటే కేసులు

గుడివాడ టౌన్: హైకోర్టు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని భవిష్యత్ భద్రతాదళం కన్వీనర్ వైవీ మురళీకృష్ణ హెచ్చరించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదలచేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిట్ పిటిషన్ నంబర్ 365/2018 ప్రకారం పట్టణంలో ఏ విధమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవం ముందు రోజున పట్టణంలో టీడీపీ నాయకులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని తాను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా.. వాటిని కమిషనర్ ఆధ్వర్యంలో తొలగిస్తున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను దుర్భాషలాడటం విచారకరమని తెలిపారు. దీంతో కమిషనర్ ఫ్లెక్సీలు తొలగించకుండా వెనుదిరిగారని, తన వద్ద సమాచారం ఉందన్నారు. గతంలో ఎన్నడూ ఈ విధమైన దుశ్చర్యలు పట్టణంలో జరగలేదన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా తానే స్వయంగా కేసులు పెడతానని న్యాయస్థానాల ద్వారా శిక్షలు పడేవరకు పోరాడతామని హెచ్చరించారు.

రైతులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం



రైతులకు రుణాలను అందజేస్తున్న మచిలీపట్నం క్రెడిట్ జీఎం హిమబిందు

పామర్రు: రైతులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా యూనియన్ బ్యాంక్ సేవలను అందిస్తోందని మచిలీపట్నం క్రెడిట్ జనరల్ మేనేజర్ జి.హిమబిందు పేర్కొన్నారు. పామర్రు శాఖ యూనియన్ బ్యాంక్ కార్యాలయంలో గురువారం రైతుల రుణాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది బ్యాంక్ ద్వారా రైతులకు వ్యవసాయ రుణాల రూపంలో రూ.15 కోట్లు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ప్రారంభం దృష్ట్యా రైతులకు మరింతగా వ్యవసాయ రుణాలను తక్కువ వడ్డీకి అందజేస్తామన్నారు. అనంతరం పలువురు రైతులకు రుణాలను అందజేశారు.

సంక్షిప్తం

- **పని గంటలు పెంచడం దుర్మార్గం**

గుడివాడ టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులను, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో పని గంటలను 10కి పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. 8 గంటలు మాత్రమే పని చేయాలన్సిన ఉద్యోగులు కొన్ని సంస్థల్లో తొమ్మిది గంటల వరకు పనిచేయిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు మంత్రి వర్గం ఏకంగా 10 గంటలు కచ్చితంగా పని చేయాల్సిందేనని తీర్మానం చేయడం దుర్మార్గం ఇంకొకటి లేదన్నారు.

- **రోల్‌బాల్‌కు కొండిపాలెం కుర్రోడు**

గుడ్లవల్లేరు: రోల్‌బాల్ ఇంటర్నేషనల్ పోటీల్లో తలపడేందుకు గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు శివారు కొండిపాలానికి చెందిన మోటపర్తి శ్రీశాంత్ ఎంపికయ్యాడు. ఏపీ, తెలంగాణా తెలుగు రాష్ట్రాల తరఫున తమ కుమారుడు శ్రీశాంత్ ఎంపిక కావటంతో తమకెంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు రాంబాబు, చైతన్య గురువారం తెలిపారు. జనవరిలో కర్నూల్‌లో జరిగిన నేషనల్ లెవల్ పోటీల్లో ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన జరిగే ఇంటర్నేషనల్ ఇంటర్నేషనల్ లెవల్ పోటీలకు తమ కుమారుడు గురువారమే బయలుదేరినట్లు తెలిపారు.

- **ప్రజా సంక్షేమమే లక్ష్యం**

తోట్లవల్లూరు: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందన్నారు. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణంతో రక్తపరీక్షలకు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా సత్వర వైద్యసేవలు అందే అవకాశం కలుగుతుందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక జెడ్పీ పాఠశాల్లో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న, బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్ పాల్గొన్నారు.

- **పరిసరాలు కలుషితం కాకుండా చూడాలి**

జమీగొల్వేపల్లి(పామర్రు): పర్యావరణం, పరిసరాలు కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో గురువారం పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఉపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

పామర్రులో..

విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.

- **చిన్నారులకు నీతి కథల బోధన**

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ లోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు గురువారం కూడా కొనసాగాయి. చిన్నారులతో నీతి కథలు చదివించడం, వాటి అర్థాలను వివరించి నీతిమార్గాలను బోధించామని గ్రంథాలయ అధికారిణి పి.శాంతి తెలిపారు.

- **నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు**

గుడ్లవల్లేరు: కౌతవరంలో శ్రీ సీతారామచంద్ర ఆలయ, విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను శుక్ర, శనివారాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. స్వామికి ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

- **మజ్జిగ పంపిణీ**

గుడివాడ టౌన్: భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. షా జ్ఞానచంద్ జైన్ వితరణతో స్థానిక ముగ్గుబజారు లోని దేవ్ ఏజెన్సీస్ వద్ద కార్యక్రమం జరిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మజ్జిగ పంపిణీ చేసినట్లు అధ్యక్షురాలు టి.హారిక తెలిపారు. వికాస్ పరిషత్ కార్యదర్శి ఎ. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.